క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ


పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రొంపిచెర్ల–2 గ్రామ రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. మంగళవారం రొంపిచెర్ల భరోసా కేంద్రం వద్ద విత్తనాల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. నేడు బుధవారం ఉదయం 9 గంటలకు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలో ఎనిమిది రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తన కాయలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి నాగరాజ, వైఎస్సార్‌సీపీ నేతలు కరీముల్లా, కోటా వెంకటరమణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ ఎల్లప్ప

సదుం: మండలంలోని నడిగడ్డ, వెంకటరెడ్డిగారిపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపీపీ ఎల్లప్ప మంగళవారం తెలిపారు. ఆ గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు గురికావడంతో మండల పరిషత్ నిధులతో ఒక్కోటి రూ. 24 వేల చొప్పున కొత్త మోటార్లు అమర్చినట్టు చెప్పారు. పనులను ఆయన పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ అమరావతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా గంగజాతర


పొంగళ్లను తీసుకెళుతున్న మహిళలు

సదుం: జోగివారిపల్లె పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో గంగజాతరను మంగళవారం కోలాహలంగా నిర్వహించారు. తిరుపతి గంగమ్మ జాతర ముగిసిన వారం రోజులకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈసందర్భంగా మారుతివారిపల్లెలో మహిళలు ఊరేగింపుగా వచ్చి పొంగళ్లను సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

అన్ని దానాల్లోకి రక్తదానం గొప్పది


రక్తదానం చేస్తున్న దాతలు

వి.కోట: అన్నిదానాల్లోకి రక్తదానం గొప్పదని సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఎండీహెచ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లి ప్రభుత్వాస్పత్రి, స్థానిక సీహెచ్‌సీ వైద్యబృందం సమక్షంలో 40 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రక్తదానం చేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, కిజియారాణి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కోకిల, యమున, ఎండీహెచ్ సంస్థ సభ్యులు చరణ్ నాని, రోహిత్ కుమార్, చరణ్‌కుమార్, చందన, శ్రావణి పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక భద్రతపై పరిశీలన

పలమనేరు: మండలంలోని జగనన్న విద్యాకానుక సామగ్రి భద్రతపై జగనన్న విద్యాకానుక పరిశీలన అధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి మంగళవారం పరిశీలించారు. జేవీకే కానుకను భద్రపరిచిన గదుల్లో తప్పకుండా ఇద్దరు పర్యవేక్షకులుండాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా నాడు నేడు పనుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట స్థానిక ఎంఈఓ లీలారాణి, సీఎంఓ గుణశేఖర్, సచివాలయ ఇంజినీర్ రూపేష్, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఇంద్రవరదుడి విహారం

యాదమరి: స్థానిక త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వామివారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు, అలంకరణల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికలో కొలువు దీర్చి, పూజలు చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు.

జనమే న్యాయ నిర్ణేతలు


కూర్మాయిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- దేశంలోనే ఎక్కడా లేనంతగా పక్కా ఇళ్లు
- నారావారిపల్లిలో చంద్రబాబు పుట్టిన ఇల్లు అరసెంటు కాదా!
- వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి
- చంద్రబాబుపై ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఫైర్

పలమనేరు: మంచికి, చెడుకు మధ్య జరుగుతున్న యుద్ధంలో జనమే న్యాయనిర్ణేతలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీలో దుగ్గినవారిపల్లి, మారుమూరు, కూర్మాయి, బేలుపల్లి క్రాస్, సాకేవూరు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పంచాయతీ పరిధిలో ఓ ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారందరికి ఇళ్లు కాదు ఊర్లనే కడుతున్నారనే విషయం అందరికి తెలిసిందేనన్నారు. పేదలకు పక్కా ఇళ్లను ఇస్తే వాళ్లు అభివృద్ధి చెందితే చంద్రబాబుకు మనసొప్పదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చూస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. మారుమూరు గ్రామంలో సీసీ రోడ్డు సమస్యపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పందిస్తూ గ్రామానికి అవసరమైన సీసీ రోడ్డును మండల గ్రాంట్ ద్వారా రూ.5 లక్షలు, జెడ్పీ గ్రాంటు ద్వారా రూ.6 లక్షలు మొత్తం రూ.11 లక్షలతో రోడ్డును మంజూరు చేశారు. ఈ పనులను వెంటనే చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు.

డ్రైన్ సమస్య తీరిందయ్యా...

దుగ్గినవారిపల్లిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తీర్చాలని గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో ప్రయత్నాలు చేసినా లాభం లేకుండా పోయిందని ఆ గ్రామస్తులు తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో తమ గ్రామానికి డ్రైన్లు నిర్మించారని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యేను అభినందించారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, బైరెడ్డిపల్లి ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు రంగన్న, చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ తిరుమలేష్, సర్పంచ్ గోవిందప్ప, ఎంపీటీసీ సభ్యురాలు మేనక, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, నేతలు రత్నారెడ్డి, మనోజ్ రెడ్డి, వీరభద్ర, అమరనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మున్సిపాలిటీలో...

మున్సిపాలిటీలోని 26, 25 వార్డుల్లో నేడు 24 వార్డులో రేపు 25న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఇందులో ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొననున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థ ఓ విప్లవం


బేలుపల్లెలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: పాలనలోనే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఒక విప్లవమని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప కొనియాడారు. మండలంలోని బేలుపల్లెలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకు చేర్చే క్రమంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు రెండు కళ్లుగా పనిచేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు పారదర్శకంగా అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. వరుసగా మూడో ఏడాది కూడా వలంటీర్లకు అవార్డులను అందజేయడం శుభపరిణామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పొందలేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వలంటీర్లు ఇంటికే వెళ్లి పథకాలను అందిస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి వలంటీర్లు చేసిన సేవ చాలా గొప్పదన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలను అందించడం సంతోషకరమన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ భాస్కర్‌మొదలి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

జగనన్న 30 ఏళ్లు సీఎంగా ఉండాలి

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటూ రాష్ట్ర ప్రజలకు సేవలు అందించాలని సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దిన్‌షరీఫ్ ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి పదవి చేపట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఫకృద్దిన్‌షరీఫ్ ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతిని, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే జగనన్నకు ప్రతిఒక్కరూ ఆశీస్సులు అందించి అండగా నిలవాలని కోరారు. కౌన్సిలర్ సాజిదాబేగం, మైనార్టీ నేతలు మహబూబ్‌బాషా, జావీద్, తబషీర్, సుల్తాన్, ఇర్ఫాన్, ఇమ్రాన్, సుభాన్, షఫివుల్లా, నవాజ్, ఉమర్ పాల్గొన్నారు.


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మైనారిటీ నేతలు

హోమ గది నిర్మాణ పనుల పరిశీలన


ఆలయ ఈఓ చంద్రమౌళితో చర్చిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న హోమ గదిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంగళవారం అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రద్దీ నెలకొనడంతో మౌలిక వసతులు, సేవలపై భక్తుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాలతో ఆలయం వద్ద నిలిచిపోయిన వాహన పూజల విధానాన్ని తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలనిలాయన ఈఓ చంద్రమౌళితో చర్చించారు.

దర్శనం కోసం వచ్చే భక్తులకు అమ్మవారికి అలంకరించిన నిమ్మకాయ, కుంకుమ, పూలను ఉచితంగా అందజేసేలా చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా పెద్దిరెడ్డి తెలిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, రాశెట్టి మధు, గంగిరెడ్డి, నవీన్‌రెడ్డి, సిబ్బంది సురేంద్రరెడ్డి, ఎల్ రెడ్డి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

రామకుప్పం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


పుంగనూరులో ప్రత్యేక అలంకారంలో మారెమ్మ

పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, చలి పిండి, చల్లముద్ద, గుమ్మడికాయలు, నిమ్మకాయలతో దిష్టితీసి పిండి దీపాలు వెలిగించి మారెమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అదేవిధంగా ఏడూరు గ్రామం వద్ద వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న నేతలు

శాంతిపురం: అనారోగ్యంతో చికిత్స పొంది కోలుకున్న కొలమడుగుకు చెందిన రాజమ్మకు వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌గా ప్రభుత్వం సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేసింది. స్థానిక మండల సచివాలయంలో మంగళవారం దీనికి సంబంధించిన చెక్కును రాజమ్మ భర్త నారాయణప్పకు నేతలు అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడ్, ఎంపీటీసీ దేవేంద్రప్ప, సర్పంచ్ మంజునాథ్ ఉన్నారు.

వేరుశనగ సాగుకు దుక్కులు సిద్ధం


పులిచెర్ల వద్ద సిద్ధంగా దుక్కులు

పులిచెర్ల(కల్లూరు): ఈఏడాది ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుశనగ సాగుకు ప్రస్తుతం రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ మాసంలో ఈపంట సాగుకు సరైన అదును. ఇందుకోసం మండలానికి వేరుశనగ విత్తనాలు కూడా వచ్చి చేరాయి. 1905 క్వింటాళ్లకుగాను 780 క్వింటాళ్లు వచ్చాయని ఏఓ శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం ఈఏడాదిలో వర్షాధారపంటగా 750 ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉందన్నారు. నెలాఖరులోపు పూర్తి స్థాయిలో విత్తనాలు రాగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వర్షాలు కూడా అదునుకు పడడంతో పంటపై రైతులు ఆశాజనకంగా ఉన్నారన్నారు.

ముందస్తు జాగ్రత్తతో టీబీ నివారణ


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వి.కోట: టీబీ వ్యాధిని ముందుగా గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేసుకోవచ్చని ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఓగు పీహెచ్‌సీలో టీబీ నివారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 'టీబీ ఓడిపోతుంది దేశం గెలుస్తుంది.. టీబీ అంతం మనందరి పంతం' అనే నినాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం 45 టీబీ రోగులకు కందిపప్పు, బుడ్డసెనగలు, నూనె, పాల ప్యాకెట్ పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ టీబీకి ఉచితంగా చికిత్స, మందులు పంపిణీతోపాటు ప్రధాన మంత్రి యోజన ద్వారా ప్రతినెలా రూ.500 ఇస్తారని పేర్కొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు హరిప్రసాద్, టీబీ సూపర్‌వైజర్ చలపతి, గోవిందరాజు, శ్రీహరి, సుబ్బరత్న పాల్గొన్నారు.

పుస్తకాలతో స్నేహం చేయాలి


కరపత్రాల ఆవిష్కరణ

పలమనేరు: నేటి విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరో గ్రంథాలయం బైక్ ర్యాలీ ఉద్యమాన్ని చేస్తున్న మంచి కుంటి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. తన ఉద్యమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితీ కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి పుస్తక పఠనంపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తులసీనాథంనాయుడు, పుష్ప, శ్రీరామచంద్రమూర్తి గ్రంథాలయ ఆవశ్యకతను తెలిపే కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఇకపై సమయానికి కూత


సైరన్‌కు సిద్ధమైన టవర్ క్లాక్

పలమనేరు: పట్టణంలోని ఏటీఎం సర్కిల్ వద్దనున్న టవర్ క్లాక్ కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో పట్టణవాసులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ టవర్ క్లాక్‌ను రిపేర్ చేయించారు. దీంతో ఇకపై పట్టణంలో సైరన్ కూత వినిపిస్తుందని ఆయన తెలిపారు.

మొరాయిస్తున్న బస్సులతో అవస్థలు



మరమ్మతుకు గురై నిలిచిపోయిన బస్సు

సదుం: మండల కేంద్రం నుంచి పీలేరుకు నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఈమార్గంలో పీలేరు డిపో ఆధ్వర్యంలో బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. మంగళవారం మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో పీలేరు డిపో బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు కాలినడకన సదుంకు చేరుకోవాల్సి వచ్చింది. వారం రోజుల్లో మూడుమార్లు మార్గమధ్యలోనే బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ మార్గంలో కండిషన్‌లో లేని బస్సులు నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యవసాయ పనిముట్లు కనుమరుగు




బోడేవారిపల్లెలో మూలపడ్డ ఎడ్లబండి, బండి చక్రాలు, చెత్తతీసే పలికి

- కానరాని ఎడ్లబండ్లు
- పత్తాలేని నాగలి
- అన్నీ యంత్రాలతోనే
- యువతకు తెలియని రైతు పనిముట్లు

పుంగనూరు: శతాబ్దకాలంగా రైతులకు వ్యవసాయంలో ఏంతగానో ఉపయోగపడిన ఎన్నో రకాల పనిముట్లు నేడు ఆదరణ కోల్పోయాయి. ఆధునిక యుగంలో రైతు రథ చక్రాలు మూలనపడ్డాయి. ఫలితంగా నేటి యువతకు ఆ వ్యవసాయ పనిముట్లు చిహ్నాలుగా మిగిలిపోనున్నాయి. వివరాల్లోకి వెళితే.. మన తాత ముత్తాతల నాటి వ్యవసాయంలో పడిన కష్టాన్ని నేడు యంత్రాలు చేయడం మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. ఉదయం కోడి కూచింది మొదలు నిద్రించేదాకా పొలాల్లో గడిపేవారు. పొలందున్నేందుకు ఎద్దులకు కాడికట్టి నాగలితో పొలం దున్నించేవారు. పంటలు వేసేందుకు రైతుల సహాయంతోనే సాగేది. అలాగే పంటల్లో కలుపుతీసేందుకు కొయ్యకు ఇనుపగొత్తులు అమర్చిన పలికి అనే వస్తువుతో పొలంలో చెత్తను తొలగించేవారు. దీనిని గుంటవలు వేయడం, పలికితోలడం అనేవారు. వీటి స్థానంలో ట్రాక్టర్లు, టిల్లర్లు వచ్చాయి. అలాగే పండిన పంటను పొలం నుంచి ఇంటికి తరలించేందుకు ఎద్దులు, బర్రెలను కాడెలుగా అనగా జంటగా కొయ్యబండ్లకు కట్టి వాటిలో వరి, రాగి, శనగ ఇతర పంటలను బండ్ల సాయంతో పంటలను ఇంటికి చేర్చేవారు. ప్రస్తుతం ఆ ఆధునిక ప్రపంచంలో వీటికి కూడా ప్రస్తుతం ట్రాక్టర్లు, ఆటోలను వినియోగిస్తున్నారు. అలాగే పండిన రాగి, ఉలవ, ఉద్దులు, జొన్న, సజ్జ పంటను ఒబ్బిడి చేసేదుకు పల్లెలో పెద్దరాతి గుండుకు ఎద్దులను కట్టి దానితో తొక్కించేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లతో తొక్కించడం, లేదా రహదారులపై వాహనాలు తొక్కేలా వేస్తున్నారు. వీటితో పాటు పల్లెలో ప్రతి ఇంటిలోను రోళ్లు, రోకలి, తిరగలి(విసురురాయి), పప్పురుద్దేగుత్తి కర్ర లాంటి వస్తువులు మనకు కనపడేవి కందిపప్పును చేయడానికి విసురురాయిని వాడేవారు. అలాగే చెట్నీలు, కారపుపొడి చేయడానికి రోళ్లలో పదార్థాలు వేసి రోకలి, రుబ్బుగుండుతో దంచడం, రుబ్బడం చేసేవారు. ప్రస్తుతం వీటి స్థానంలో మిక్సీలు, గ్రైండర్లు రావడంతో ప్రజలు సుఖానికి అలవాటుపడ్డారు. శతాబ్దాలుగా ఉన్న వస్తువులు నేడు ఉనికి కోల్పోతూ,చరిత్రకు సాక్షాలుగా మిగిలిపోనున్నాయి. అదే రీతిలో వ్యవసాయరంగంలో టాక్టర్లు, టిల్లర్లు, జేసీబీలు రావడంతో ఆధునిక వ్యవసాయ రంగందే పైచేయిగా మారింది. దీనిద్వారా రైతులు పాతపద్ధతులకు స్వస్తిపలికారు. యంత్రాలతోనే వ్యవసాయం చేసేందుకు మొగ్గచూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పురాతన పద్ధతులు పూర్తిగా కనుమరుగై చరిత్రలో సాక్ష్యాలుగా మిగిలిపోనున్నాయి.


రుబ్బురోలు


తిరగలి (విసురురాయి)


పొలం దున్నే నాగలి